# నలవేషం

గూడవల్లి రామబ్రహ్మం

నటకులు వేషధారణంలో ఏమీ శ్రద్ధతీసికోవటంలేదు. ప్రదర్శనవిజయం నటకునికంటే, రంగాలంకారాలపై, వేషధారణపై ఎక్కువ ఆధారపడి ఉంది. నేడు నటకుడు కిరాయివాడవటంవల్ల ఆదర్శనాట్యరంగం హుళక్కయిపోయింది. కాని వేషధారణపై నటకు డింతఉదాసీనత చూపడానికి కారణం ఏమిటో గ్రహింపలేకున్నాము.



నలుని చిత్రాన్ని వ్రాసివ్వమనగా మాచిత్రకారుడు, ఎస్. వి. ఎస్. రామారావు దీన్ని వ్రాసియిచ్చాడు.

వేషానికి, రాత్రికి నూర్లకొలది గుంజుతున్న నటకుడు ఆవేషానికి కావలసిన దుస్తులువగైరా సమకూర్చుకోకపోవటం క్షమింపరానికార్యం. అందుచేత, నటకులను గుత్తతీసికోవటానికి కంట్రాక్టరులు బయలుదేరినట్లు, దుస్తులు వగైరా సరఫరా చేయటానికికూడా కంట్రాక్టరులు బయలుదేరారు. అటునుండి నటకుడు వేషంవేయటానికివస్తే, యిటునుండి డ్రెస్ మేకర్ 'గ్రీన్‌రూమ్' లోనికి కాలిడతాడు. వారిచ్చినదుస్తులు, వీరు పాడినపాటలు, హాలులో చివికిపోయి పడివున్న సీనులు మనప్రదర్శనాలలో బహిర్గతమవుతున్నయి. ఇది ఆంధ్ర నాట్యకళకు తీరని కళంకాన్ని కూర్చటమేకాకుండా నటకుల నిర్లక్ష్యభావాన్ని నిరూపిస్తున్నది.

మొహంమీద 'పెరల్ క్రీమ్' పూయకముందు, ఖరారుడబ్బు చేతులో ఖంగున పడితేనే, వేషం వేయటానికి పూనుకుంటున్న ప్రస్తుత నటకుడు, తాను

వేయనున్న వేషాన్నిగూర్చి ఒకించుకంతైనా ఆలోచించకపోవటం ఆంధ్రుల దురదృష్టం. ఇది ఒక క్షుద్రజాతినటకులుమాత్రమే చేస్తున్న నేరంకాదు. మహా మహులు, బడాఅద్మీలుకూడా యీ పాపానికి ఒడిగట్టుతున్నారు. ఉదాహరణంగా ప్రస్తుతం నలవేషం తీసుకుందాము. ఈ వేషానికి తయారగు నటకులంతా ఘరానామనుషులే అయితీరాలి. వారంతా యీవేషాన్ని యెట్లావేస్తున్నారో మనమొకసారి ఊహించుకుందాము. బూట్సు, స్టాకింగ్సు, ధోవతి, చొక్కా, కోటు, తలపాగ, దానిపైన ఒక యీక, చేతిలో ఒక రుమాలు (బహుశః చెమటబొట్టులు తుడుచుకోవటానికి, లేదా 'గ్రీజ్‌పెయింటు' సరిచేసికోవటానికి)-యిది మామూలు నలవేషం; రైల్లో బొగ్గువేసే మనిషిలాగు నల్లరంగులో ముంచెత్తిన ఒక అంగీతో బాహుకవేషం తయారవుతుంది. ఈ వేషాలు ఎంతవరకు అంగీకారయోగ్యాలు, ఎట్లావుంటే బాగుంటుంది అనునవి ప్రస్తుత చర్చనీయాంశాలు.

సాధారణంగా ఒకవేషాన్నిగూర్చి చర్చించాలంటే, మూడు విషయాలు ముఖ్యంగా గమనించాలి: 1. పాత్రకాలము, 2. గ్రంథకర్తపాత్రచిత్రణము, 3. సమకాలిక గ్రంధపఠనము. ఈ మూటిని మనసునందుంచుకొని, నటకుడు ఒకచిత్రాన్ని చిత్రించుకో ప్రయత్నించాలి. అసలీప్రయత్నము నాటకకర్తే యధార్థంగా చేయవలసింది. ప్రతిరంగముఖాన రంగాలంకారాలు, పాత్రవేషధారణము వర్ణింపవలసిన బాధ్యత ఆధునిక నాటకకర్తవిధియైవుంది. కాని మన నటకులకు బూజుపట్టిన పాతనాటకాలమీదే మోజుండటంచేత, యిది నటకుల కర్తవ్యంగానే మారిపోయింది.

## నలవేషధారణము

నలుని కాలనిర్ణయానికి పూనుకుంటే భారతం పెరుగుతుంది కాబట్టి, నలుడు ద్వాపరయుగాంతంవాడనిన్ని, భారతగాథకు కొంత పూర్వీకుడనిన్ని మనం దృఢంగా స్ఫుటపర్చుకోవచ్చు. పౌరాణిక యుగానికిచెందిన యీపురుషుడు ఎట్టి దుస్తులు ధరించాలో ప్రస్తుతము మనము నిర్ణయించాలి.

వేదకాలంలోగాని, మరి పౌరాణికయుగంలోగాని కుట్టినదుకూలములను ధరించిన ఆధారాలు మనకు కనబడటంలేదు. పురుషులు 'నీవి' అనే ధోవతిని, 'అధివాసస్సు', లేక 'పరిధాన' మనే ఉత్తరీయమును ధరిస్తున్నట్లును, స్త్రీలు 'అంతరీయము'ను మొలచుట్టును, 'ఉత్తరీయము'ను మేలిముసుగుగాను ధరిస్తున్నట్లును వేదములు, పురాణములు చెప్పుతున్నవి. శృంగారనైషధంలో కలి

రాజుసైన్యభటులు 'నీలి పట్టుబొందడములు' ధరించుకొని వచ్చిరని వర్ణింపబడి వుంది. కాని అది కలికాలపు విద్యార్థులతో జతపఱుపబడియుండటంచేత ఆకాలమునాటి కాఆచారము లేదనే చెప్పవచ్చు. పైగా, భుజదండములకు కేయూరములు ధరించినాడని వర్ణింపబడిన శ్రీహర్షుని నలుడికి చొక్కా లేదనే మనము నిర్ణయించవలసివుంటుంది. అందుచేత నలుడు చొక్కా, కోటు వగైరా తొడుగుకొని, నవనాగరికపు రాజుగా రంగంమీద తయారవడం ఆక్షేపణీయాంశమే అవుతుంది. ఒక్క 'నీవి' 'పరిధానము'లతో నలవేషధారణకు పూనుకోవడమే సమంజస మవుతున్నది.

కాక, మరియొకవిషయం. స్తనవల్కలములతోవున్న యౌవనవతికి మేలిముసుగునకై 'ఉత్తరీయ' మెంత అవసరమో పురుషునకుకూడా 'పరిధాన' మంత అవసరంగా నాడు తలపబడుచున్నది. పచ్చిమాంసముతోనైన ఆకలితీర్చుకోనెంచి పక్షులపై విసరబడ్డ పైబట్టతో పక్షులెగిరిపోవ, 'వసనము' పోయినందుకు వగచివగచి భార్యచీరకొంగుమాటున మర్యాదను కాపాడుకొని, చివర కర్ధరాత్రమున, భార్యతో చెప్పకుండా విడిచిపోవడానికి తయారయిన నలుడు, సభ్యతకోసం, చీరకొంగు చింపుకొని పైనవేసికొనివెళ్లు గాథను ప్రదర్శించుతూ, నేటి నటకుడు పైన వస్త్రంలేకుండా రంగముపై తైతెక్కలాడడం ఎంత తెలివితక్కువపని......? నిజంగా నాడు చొక్కాలు, కోట్లు ఉన్నట్లయితే, పైవస్త్రములేందే బజారులలో తిరుగరాదనే సమయాని కవకాశమున్నదా? అట్లాచ్ఛాదనమునకు వేరుదుస్తులు లేకపోవుట వల్లనే యీ నియమ మానాడు యేర్పడియుండును. అట్లు కానిచో, నలుడు ఏ బెంగాలీ బాబులాగో, కట్టుపుట్టముతో, నల్ల కోటుతో భార్యా పరిత్యాగానికి పాల్పడేవాడే!............

కాలము—నాటకము—బట్టి నిర్ణయించిన యీవేషధారణానికి తదితర గ్రంథములు మన కెంతవరకు సాయపడునో యిట పరికింతాము. నలుడు మహాపరాక్రమవంతుడు. చిన్నతనంలోనే

'తలవెండ్రుక లెగగట్టెడు
కొలదిన యా నృపకుమారకుడు కడిమిమెయిన్
నలుదెసల గరుల గండ
స్థలఫలకములన్...............'

జయశాసనాలు లిఖింప జేసినాడు. పైగా

'కెరలి మహాసివేమసహకృత్వరితద్భటకోటిచాతురీ
తురి సమరాంగణంబులఁ జతుర్వారిదావరణంబులన్ యశోంబరముల'

ను రాకాచంద్రకిరణములవలె సుదీర్ఘములైన తన ధైర్యాదిగుణములనెడి నూలుపోగులతో నేసి పంచిపెట్టిన నలమహారాజుమొలలో ఒక కత్తికూడా ఉంచకపోవటం అన్యాయమవుతుంది. ఆ మహారాజు తలపై పాగకంటే కిరీటముంచడం న్యాయం. రత్నగర్భయని పేరొందిన నిషధదేశపురాజుహస్తములకు కంకణాభరణములు, చెవులకు కుండలాలు, మెడకు తారహారములు తగిలించుట సబబు. ఇంకొకవిషయం. నలమహారాజువర్ణనముపట్ల, శృంగారనైషధము, నలుని కేశపరిష్కారముగూర్చి ఒక క్రొత్తవిషయం తెలుపుతోంది. ఆపద్య మిది:

'కొండని వేడ్కతో బసిడికొండ ధనార్థులకెల్ల బంచియీ
కుండుట, దానధారకు బయోనిధులెల్ల వ్యయింపలేమి, యీ
రెండపకీర్తులం దలధరించినవాడు ప్రదానశీలుఁడా
తం డిరువాయగా ముడికిదార్చిన వెంద్రుకలన్మిషంబునన్.'

పసిడికొండను పంచిపెట్టలేకపోయినందులకు, దానధారతో సముద్రమును ఇంకింపచేయనందులకు, ఈ రెండపకీర్తులు నలుని నెత్తిపై పాపటకు చెరియొకవైపున కూర్చున్నట్లుగా నలుని తలవెంద్రుకలు యిరువైపుల వేసిన ముళ్లు భావింపచేసాయట!...ఈవిధమగు కేశసంస్కారముతో, కిరీటముతో, తారహారములతో, కేయూరములతో, కంకణాభరణములతో నలవేషధారణం దిద్దితే యెంత బాగుంటుంది...ఇలాగే పరిశోధనచేస్తే, యింకెన్నో అద్భుతవిషయాలు వేషధారణ కక్కరకురావచ్చును. నటు డిట్లా ప్రతివేషమునకు పరిశోధనకు పూనుకోవడం ప్రధానకర్తవ్యం.

ఇంకొకవిషయం. అంతటితో ఈ వ్యాసము సరి. నలవేషధారి మరియొకతప్పు చేస్తున్నాడు. మానవభాషనేర్చి, వేయేం డ్లాయుస్సుపోసుకున్న ఒక ముసలిసర్పం కరిస్తే నలుడు వివర్ణుడయ్యాడని నాటకకర్త వ్రాస్తే, నటుడు **Side Curtain** లోకిపోయి, నల్లని అంగీ ఒకటి మెడకు తగిలించుకొని

'చండహుతాశకీలకునుసాటియనందగు శ్వేళవహ్నియీ
కుండలి నన్నుదా గఱచె గ్రూరత, నింక మనంగజాల'

నంటూ తిరిగి రంగంలోకివచ్చి యేడుస్తాడు. పాముగరిస్తే, విషమెక్కి, మొగం వైవర్ణ్యం చెందాలిగాని, బట్ట లెట్లా నలుపెక్కుతాయో తెలియరావటంలేదు. ఈవిధంగా నటకులు వేషధారణంలో దొర్లించేతప్పు లింకా చాలా ఉన్నయి. ప్రస్తుతం సెలవు.

Source: Press Academy Website, Natya Kala, Dec 1934

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan